దివ్యజ్యోతివి స్వప్రకాశకరితోద్దీప్తాఖిలాకాశవున్
భవ్యస్తవ్యవు నద్వయస్థితివి శోభా సుందరాకార సం
సేవ్యత్వ ప్రభుతాదిక ప్రవిలస త్త్రీమూర్తివో తల్లి, బా
వవ్యక్తంబొనరింపు నీదు మధుర వ్యక్తిత్వమున్ నిత్యమున్ 3

కలవరమందినాఁడ బ్రతుకంగఁ గుటుంబముఁగావ నిత్యమున్
నలిపెడి కర్మజాలముల నాటికి నాటికిఁ బుట్టు ప్రశ్నలన్
నిలుకడ తో నెదుర్కొని వినిర్మలరీతిఁ జరింప శక్తియున్
నెలవుగ దాంతి శాంతి ధృతి నీతి వినీతియు నీయవే వెసన్ 4

శ్రీవి కృపారసార్ద్ర మృదు శీతల శీల హృదబ్జ భూషిత
స్త్రీవి నిరంతరంబు నిను జేరి భజించెడి నీదు పుత్రులన్
బోవిడువంగ న్యాయమె విభూతిప్రభావము భాసురంబుగ
శ్రీవిసరంబు లిచ్చి కడుఁ బ్రేమను బోషణ చేయు మెప్పుడున్ 5

చనిన దినాలె నేర్పె నొక చక్కని పాఠము, మాకదే మనన్
ధనమె భవత్స్వరూపమనఁ దప్పు — గుటుంబము గావఁ జేర వ
చ్చిన యతిథిన్ దగన్ దనుప శ్రీహరిసేవ నొనర్పఁ జాలు నా
ధనమును దృప్తి శాంతియు సదా ముదమున్ భవదీయ రూపమౌ 6

సద్గుణముల వెలయు చారుమతికిఁ గాను
పించి గాఢభక్తి ప్రియములునిడి
నెగడుచుండు నిన్ను నిత్యంబుఁ దలఁచెదఁ
బరమ శివనుత ప్రభావ మహిత 45

అమృతముఁ గామధేనువులు నప్సరసల్ శశి కల్పభూరుహం
బమర గజాశ్వముల్ బుధగణార్చిత, సోదరతన్ రహింప సం
ద్రమునకుఁ బుత్రివై హరికిఁ దద్దయుఁ గూర్చు సతీలలామవై
యమిత ధనేశవౌ త్రిభువనాంబ, నినున్ గొనియాడ శక్యమే! 46

కలశాంబోధి జనించినప్పుడె మనఃకంజంబునన్ దల్చి, యీ
జలజాతప్రభవాండ మిల్లనుచుఁ దేజఃపూర్ణ సూర్యేందు మం
డలమున్, చుక్కలు. దివ్వెలంచుఁ బదియున్ నాల్గున్ జగంబుల్ గదుల్
జెలువౌ భాండములంచుఁ, శౌరిఁ బతిగాఁ జింతించితే చిన్మయీ! 47

ఓ జగదేకరాజ్ఞి! పరమోత్సుకతన్ సురలెల్ల దుందుభి
శ్రీ జయనాద నృత్యములు సేయఁగ నీకు సురద్విపంబు లం
భోజ పరాగ మిశ్రిత సముజ్వల శుభ్ర పయోభిషేకమున్
రాజిత రీతి సల్పునెడ రాజిలు నీ విభవంబు నెంచెదన్ 48

అట్టియలక్ష్మి మూలమగు నర్థమధర్మపు మార్గమందుగా
ల్వెట్టిగడించు కంటెఁ బృథివిన్ నిరుపేదరికంబ మేలు మే
ల్బల్లలు గట్టి మేడలను వాసముసేసిన నేమి వచ్చెడిన్
గట్టిగమేనువంచి శ్రమఁ గంది భుజించిన నేమి తక్కువౌ? 87

తల్లి! పేదలయందు లేని సుగుణౌదార్యమ్ము లర్థాఢ్యులన్
గొల్లల్ పోవునె? నీకృపన్ గనుటకున్ గోర్కెన్ నినున్ భక్తితో
నుల్లంబందునఁ బూజసేయుటకు ని యుద్యన్మహత్త్వంబులన్
దెల్లంబౌ నటుజూడ బేదలకు బృథ్విన్ లేవు సౌమ్యగుణుల్ 88

పేదలు సద్గుణాఢ్యులయి పేర్మిఁ జెలంగగలేరొ నిత్యసం
మోదముతోడ నాశలను ముగ్గక కష్టముచేసి యైకమ
త్యాదులు గల్గి యెప్డుఁ బరమార్థమునెంచుచు నీతితోడ ని
మ్మేదినిలోఁ జరించినను మేలగు జీవన సౌఖ్యమందరే? 89

జననీ! పేదల జీవనంబు కరుణా సంయుక్తమై ప్రేమవ
ర్ధనమై యార్త సహానుభూతి భగవద్భక్తిప్రదంబై తపో
జనకంబై, యఘభీతి కర్మఫల సుజ్ఞానావహంబై,నిరం
జననిర్మోహక పారమార్థిక మనీషా పోషకంబౌ గదే! 90

ధర్మమార్గంబును దప్పక కష్టార్జ
నము సేసినట్టి ధనంబు కొంచె
మైన దక్షిణ పురుషార్థములకు దాని
నుపయోగ మొనరించు చెపుడుఁ దల్లి

తల్లిదండ్రుల మిమ్ము దద్దయు భక్తి ల
క్ష్మి విష్ణులను నాకుఁ జూపుచుండు
నీటినైన నొసంగి నింగిని విగ్రహ
వృక్ష తీర్థాదుల వెలయు మదిని

ధ్యానమొనరించి పూజించి యఖిల సృష్టి
మంగళంబగు నీ కళామహిమఁ జూచి
జ్ఞానమానందమును నొందు సద్గృహస్థుఁ
గముల! మన్నింపవే నీవు కరుణతోడ 93

రవి శశి భాగ్ని విద్యుదభిరామరుచుల్ భువియంబుదాబ్ధులుగా
ప్రవిమల మౌ విహాయసము వాయువు స్థావరజంగమంబులుగా
దివిజులు నాదిగా గలిగి దేవి! మనోహరమైన సృష్టి నీ
వివిధ మహాద్భుతంబయిన పేరిమిఁ జూడను పేద పేదయే? 94

పేదరికంబు చెడ్డది వివేకము మాపు దురంత చింతలన్
బాధల దెచ్చుఁ బొట్టకయి పాప మొనర్పగఁ జేయు దీని ద
ల్లీ! దయతోడ వేగ పెకలించి సముంచిత సంపదుత్స వా
హ్లాదలతల్ సముంబుగ నిలన్ దగఁ బెంపు కృపామృతంబునన్

ధనకనకాదుల జనులు దురాశా ప
  రులుగాక ధర్మపరుల్ శ్రమజులును
నై పరహిత బుద్ధులై ధనికత్వమే
  పరమార్థ మని తలపక ధనంబు
గలిగిన గర్వంబు కలుగకున్నను భేద
  మును పొంద కెంతయు ముదముతోడ
సమబుద్ధి గల్గి ద్వేషమును మాత్సర్యంబు
  గలుగక కలహముల్ తొలగి తల్లి!

విశ్వకల్యాణవాంఛులై విద్య నేర్చి
దుష్ట పద్ధతులను వీడి దురితములను
జేసి కెప్పుడు భక్తితోఁ జింత సేయు
నట్లనుగ్రహ మొసరింపుమమ్మ కరుణ!

